నిరంతర ప్రయాణికుడు

మధ్యాహ్న భోజనానంతరం కొంతసేపు నిద్రపోయి లేవడం నా అలవాటు. ఆ రోజు మధ్యాహ్నం భోజనం చేయగానే రైలెక్కాను. బండి కుదుపులే తూగుటుయ్యాలగా ఒళ్లు తెలియకుండా నిద్రపట్టింది. మేలుకునే సరికి గంట నాలుగైంది.

గదులు గదులుగా విభజింపబడిన రెండో తరగతి కంపార్టుమెంటులో ప్రక్క గదిలోనుంచి బిగ్గరగా మాటలు వినిపిస్తున్నాయి. 'ఈ గొంతు ఎక్కడో విన్నట్టుందే!' అనుకున్నాను.

చెవి వొగ్గి విన్నాక కొద్దిక్షణాల్లో పోల్చుకున్నాను గూడా! అతడి పేరు రంగపతి.

వానాకాలపు ఏటి వరదలా అతడి వాక్ప్రవాహం అద్దూ అపూ లేకుండా సాగిపోతూ వుంది.

"ఏమండీ! తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్లవలసి వున్నప్పుడు మీరు 'వెంకటాద్రి'ని ఎందుకెన్నుకుంటారు సార్? 'రాయలసీమ'లో జర్నీ హాయిగా వుంటుంది గదా! సాయంకాలం మూడున్నరకు రైలెక్కితే మరునాటి ఉదయం ఎనిమిదింటికల్లా నాంపల్లిలో దిగియొచ్చుగదా!

కడపలో భోజనం చేసి పడుకుంటే నిద్రలేచేసరికి మీరు హైదరాబాద్ శివార్లలో వుంటారు. హైదరాబాద్ ప్రయాణానికి నేనెప్పుడూ 'రాయలసీమ'నే ప్రిఫర్ చేస్తాను. ఇప్పుడైతే అనంతపురం వెళ్తున్నాను గనుక, వెంకటాద్రిలో వెళ్లడం తప్పనిసరైపోయింది."

"ఇంతకీ అనంతపురం ఏం పనిమీద వెళ్తున్నారు?" ఎవరో ప్రశ్నించారు.

"ఆ మాటెందుకులెండి! అనంతపురంలో మా చిన్నమామగారి అమ్మాయి పెళ్లి. పెట్టి పుట్టినవాడు. ఆయనకేం కొదువ? పెద్ద బిజినెస్సుంది. పది పదిహేనువేలదాకా అద్దెవచ్చే ఇండ్లున్నాయి. నలుగురు కొడుకులూ నాలుగు దిక్కుల్లో పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. కానీ ఏం లాభం? ఆయనకు లేనిదల్లా అంగబలమే! వారం రోజులు ముందుగా వచ్చి కార్యం నిగ్రహించి పోవలసిందిగా నాకొక ఉత్తరం రాసి పడేశాడు! అయితే ఆ ఉత్తరం వచ్చేటప్పటికి నేనెక్కడ వున్నాను?"

"ఎక్కడున్నారు?" ఓ శ్రోత కుతూహలం వెలిబుచ్చాడు.

అందుకున్నాడు రంగపతి-

"అప్పుడు నేను మెడ్రాస్‌లో వున్నాను. ఆ మెడ్రాస్‌కైనా ఎలా కొట్టుక వెళ్ళాను? విజయవాడలో మా నాన్నగారి స్నేహితుడొకాయన వున్నాడు. చదివించడానికైతే కొడుకును డాక్టరీ చదివించాడుగానీ, ఉద్యోగం సంపాదించిపెట్టలేక సతమతమైపోతున్నాడు.

ఇటీవల గవర్మెంటు హాస్పిటల్స్‌లో కొన్ని వేకన్సీలు ఏర్పడినట్టు తెలిసింది. తెలియగానే తక్షణం బయల్దేరి రమ్మంటూ ఉత్తరం రాశాడు. విజయవాడకు 'తిరుమల'లో వెళ్ళి, కాండిడేట్‌ను వెంటబెట్టుకుని, 'గోదావరి'లో హైదరాబాదు చేరుకున్నాను. తీరా అక్కడికి వెళ్ళాక ఒక పెద్ద సిపారస్ పట్టుకొస్తేగానీ, పని సానుకూలం గాకపోవచ్చునని తెలిసింది.

ఆ సిపార్స్ చేయవలసిన ఆసామి ఎక్కడున్నాడు? మెడ్రాస్‌లో వున్నాడు. వెళ్ళినంత దూరం మళ్ళీ తిరిగొచ్చి రేణిగుంటలో దిగి, అట్లాగే 'సప్తగిరి'లో వెళ్ళి మెడ్రాస్‌లో వాలాను. రెకమెండేషన్ లెటర్ సంపాదించేసరికి రెండురోజులు పట్టింది. దాన్ని కాండిడేట్ చేతికిచ్చి, అతణ్ణి హైదరాబాద్‌కు పంపించేశాను. నేడు మెడ్రాస్‌నుంచి తిరిగొచ్చేసరికి – బల్లపైన ఈ తాఖీదు కనిపించింది..."

"అదేం తాఖీదో?" ఇద్దరు ముగ్గురు ఏకకంఠంతో ఆశ్చర్యం ప్రకటించారు.

"అదేనండీ మా చిన్న మామగారి ఉత్తరం. పెళ్ళికి రమ్మని రాశారన్నానే, అది!"

"ఈ తిరుగుళ్లతో మీకు బేజారుగానే వుండొచ్చు పాపం!" ఒకాయన సానుభూతి ఒలకబోశాడు.

"ఎందుకు చెబుతార్లెండి! పడుకుని నిద్రపోతుంటాను. దడదడమంటూ శబ్దం వినిపిస్తుంది. రైలు వంతెనపైన వెళ్తూ వుంటుంది. హఠాత్తుగా మేలుకుని వుంటానుగదా! ఇల్లలుకుతూ పేరు మరిచిపోయిన ఈగలా, రైల్లో ఎక్కడికి వెళ్తున్నానో గుర్తుకురాదు. ఎక్కడినుంచి బయల్దేరానో జ్ఞప్తిలో వుండదు. ఏ పనిమీద వెళ్తున్నానో స్ఫురించదు. ప్రక్క స్టేషన్లో రైలాగేదాకా, నా గతి అంతే!

ఆగిన తర్వాత ఆ స్టేషను పేరేమిటో తెలిసొస్తుంది. ఓహో, ఇది బంగారు పేట స్టేషన్. కాట్పాడి – బెంగుళూరు మార్గం. బెంగుళూరులో దిగి హిందూపురంలో జరిగే ఒక గృహప్రవేశానికి వెళ్లాల్సి వుంది... ఇలా ఒక్కొక్కటిగా విషయాలన్నీ జ్ఞప్తికొచ్చేస్తాయి..."

ఆ పాటికి రంగపతిపట్ల సహ ప్రయాణీకులకు ఎనలేని భక్తి ప్రపత్తులు కలిగి పోయినట్టే వున్నాయి. ఒక వ్యక్తి ఎంతో వినయంగా వాకబు చేస్తున్నాడు – "ఏమండీ! ఈ బండిలో భోజనాలెక్కడ?" అని.

"ధర్మవరంలో పెడతార్లెండి!" అందిపుచ్చుకున్నాడు రంగపతి.

"రైల్వే రెస్టారెంటులోకి వెళ్లి భోంచేసినా చేయవచ్చు. ప్లాట్‌ఫారంపైన పెరుగన్నం, పులిహోరా పొట్లాలు దొరుకుతాయి. నంజుకోడానికి వడలుంటాయి. కావాలంటే పళ్లు కొనుక్కోవచ్చు. అంతెందుకు? రైలు ప్రయాణాల్లో ఏదేది ఎక్కడెక్కడ దొరుకుతుందో నన్నడగండి! క్షుణ్ణంగా చెప్పగలను.

తెనాలి స్టేషన్లో పాలకోవా కారుచౌక. సింగరాయకొండ సపోటాపళ్లకు ప్రసిద్ధి. తాడిపత్రి జామకాయలంటే కలకండతో సమానం. పనసతొనలు తినాలంటే శ్రీరంగం వెళ్ళాలి. నెల్లూరి నుంచీ శ్రీకాళహస్తిదాకా నిమ్మకాయలు కొల్ల అగ్గవ. కోడూరు, రాజంపేట స్టేషన్లలో అరటిపండ్లు ఎవరు కొన్నా డజన్ల లెక్కన కొనరు. అలాగె గెలలు గెలలుగా కొనేస్తారు. మీరు ఢిల్లీనుంచి దక్షిణాదికి రైల్లో ప్రయాణం చేశారా ఎప్పుడైనా?

నాగపూర్ ప్రాంతాల్లో కమలాపళ్ళు బుట్టలు బుట్టలుగా సీట్ల క్రింద పెట్టుకుంటూ వుంటారు. మామిడి పళ్ళల్లో రకాలయితే ఎన్నెన్నో వున్నాయిగానీ, ఆ రకాలకన్నింటికీ రాజు మల్‌గూబా. మీరు మల్‌గూబా మామిడిపళ్ళు తి...త్తి...త్తినా... లంటే..."

గ్రామఫోను ముల్లు గాడి తప్పినట్టుగా రంగపతి ప్రసంగం అర్ధాంతరంగా ఆగిపోయినందుకు కారణమేమిటో తెలిసిందిగాదు. ఈలోగా కంపార్టుమెంటుకటువైపు

ద్వారం దగ్గర ఏదో అలజడి చెలరేగుతున్నట్టు తోచింది. "ఏమయ్యా, నిన్నే అడగడం! నువ్వెక్కిందెక్కడ? ఎక్కడికెళ్తున్నావు? టిక్కెట్టెక్కడ?" గదమాయింపు స్పష్టంగా వినవచ్చింది.

టికెట్టులేని ప్రయాణికుడు సంజాయిషీ ఏమిటో వినరావడంలేదు.

టి.టి.ఇ. మండిపడిపోతున్నాడు - "ఇదేం మీ తాతల బండి అనుకున్నావా? కట్టవయ్యా పెనాల్టీ! తిరుపతినుంచి కట్టు. నూట ఇరవై మూడు రూపాయలు ఎత్తు. పైకి తియ్యవయ్యా డబ్బు..."

సరిగ్గా, అప్పుడే నాకు రంగపతి దర్శనం లభించింది. మెల్లగా సాగబారి టాయ్‌లెట్‌వైపు వెళ్తూ, అతడు నాకు కనిపించాడు.

టికెట్టులేని ప్రయాణికుల పాలకువ టి.టి.ఇ.ల కెట్లాగో తెలిసిపోయేటట్టుంది. అల్లంతదూరంనుంచే అతడు రంగపతి ముంగాళ్లకు బంధం వేసేశాడు.

"అయ్యా, ఏమండీ-మిమ్మల్నే! కాసేపుండండి సార్? టిక్కెట్టు చూపించి వెళ్దురు గానీ..."

రంగపతి ముఖం వెలవెలపోయింది. కానీ టికెట్టులేని యిక్కట్టును అధిగమించగలిగే తన అసమాన కౌశలం గుర్తుకొచ్చిందేమో, మరుక్షణంలోనే తేరుకున్నాడు. కిటికీకడ్డంగా 'పాసేజి'లో ఠీవిగా నిలబడి, నింపాదిగా జేబులో చేయి వేశాడు. అయితే అతడు జేబులోనుంచి టిక్కెట్టు పైకి తీస్తాడనుకున్న వాళ్ళకు ఆశాభంగం మాత్రమే మిగిలింది. పైకొచ్చింది సిగరెట్టు పెట్టె మాత్రమే!

"ఏది సార్? ఎక్కడ మీ టిక్కెట్టు!" అంటూ టి.టి.ఇ దగ్గరికొచ్చేశాడు.

"హిహ్హిహ్హి! రైల్వే వాళ్ళంగదండీ!" నవ్వలేక నవ్వేశాడు రంగపతి. "గుంతకల్లు డివిజన్‌లో రిలీవింగ్ స్టేషను మాష్టరులేడూ, చిదంబరం ఆయన మా అన్నగారే!"

"నేనడిగింది బంధుత్వాలను గురించి కాదండీ! మీ టికెట్టును గురించి..." టి.టి.ఇ విదిలించి పారేశాడు.

"చూడండి సార్! యూనియన్ సెక్రెటరీ సుబ్బరాజు తెలుసా మీకు? ఆయన స్వయంగా నా బావమరిది. ఇంకా కావలిస్తే వాకబుచేసి..." అంటూ గింజుకోసాగాడు రంగపతి.

"అయ్యా, నాక్కావలసింది టిక్కెట్టు. అది చూపిస్తే మంచిది. అలాకాదా, పెనాల్టీ కట్టాలి. అదొక పద్ధతి. లేదా కదిరిలో పోలీసులకు హాండోవర్ చేస్తాను. అది మూడో పద్ధతి..."

రంగపతి ముఖం చిన్నబోయింది. సూదుల్లా తొలిచేస్తున్న తోటి ప్రయాణికుల వాడి చూపులకు తట్టుకోలేక అతడు పెదముఖం పెట్టుకున్నాడు. అల్లాగే రెండడుగులు వెనక్కువేసి టాయ్‌లెట్ వైపుకు జారుకున్నాడు.

"పెద్దమనిషి వేషం వేస్తే సరిపోయిందా? చేష్టలు గూడా అందుకు తగ్గట్టుగానే వుండాలి. ఈయనగారు నా చేతికి దొరికిపోవడం ఇదే మొదటిసారి కాదండోయ్! రెండు నెలల క్రితం ఇట్లాగే తగులుకున్నట్టు తగులుకుని ఎలాగో ఉడాయించేశాడు. ఈసారి అలా జరగదులెండి! నా జాగ్రత్తలో నేనుంటాను..." ఇంచుమించు స్వగతంలా చెప్పుకుంటూ, రైల్వే ఉద్యోగి రంగపతిపైన్నే నిఘా పెట్టేశాడు.

రిలీవింగు స్టేషను మాష్టరు చిదంబరంగానీ, యూనియన్ సెక్రటరీ సుబ్బరాజుగానీ రంగపతికి దూరపు బంధువులవునో కాదో నాకు తెలియదు. కానీ నాకు మాత్రం అతడితో కాస్తా దూరపు బంధుత్వం వుంది. వాళ్ళది మా పొరుగూరు మల్లవరమే! నిజానికి వాళ్లదేమంత కలిగిన కుటుంబం గాదు.

తండ్రి పంచాయతీ బోర్డు ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తుండేవాడు. కొడుకును తనకన్నా ప్రయోజకుడుగా చేయాలని ఆ తండ్రి శతవిధాలా ప్రయత్నించాడు. రంగపతి కాలేజి మెట్లయితే ఎక్కాడుగానీ, డిగ్రీ మాత్రం పుచ్చుకోలేదు. వాక్చాతుర్యంపైన నమ్మకం ఎక్కువేమో మరి, అతడు మాటలతోనే ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవచ్చునని భావిస్తూ వుంటాడు. ఒళ్లువంచి పనిచేయడమంటే మహా చిరాకు. పనికొచ్చే ఏ పనికైనా అతడు విముఖుడే!

బరువు మోయకుండా, బాధ్యత లేకుండా సుఖ జీవితం గడపాలనుకునేవాడికి పెళ్ళి చేయాలనుకోడం పెద్ద తప్పు. రంగపతి తల్లిదండ్రులు ఆ తప్పిదానికి పాల్పడ్డారు. గుడ్డిలో మెల్లగా ఎంతో కుదురైన అమ్మాయి ఆ ఇంటికి కోడలుగా వచ్చింది. ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా పనిచేస్తూ ఆమె నాలుగు రాళ్లు సంపాదిస్తుంది. అదిలించి, బెదిరించి ఆమె సంపాదనలో ఒక నికరవాటా చేజిక్కించుకుని రంగపతి ఇలా ఊళ్ళపైనబడి తిరుగుతుంటాడు.

బండి కదిరి స్టేషన్లో ఆగగానే చిన్న ఊరేగింపు ఒకటి ప్లాట్‌ఫారం పైన బయల్దేరింది.

మాసిన, చిరిగిన, మాసికలు పడిన దుస్తులతో, రేగి, చుండ్రుబట్టి, దుబ్బులా తయారైన జుత్తుతో, వాడి, వసివారిపోయి, చీకట్లే పారాడుతున్న ముఖాలతో దాదాపొక పాతికమంది శాల్తీలు ఆ మెరవణిలో పాల్గొంటున్నారు. వయసునుబట్టి చూస్తే నూనూగు మీసాల వాళ్లదగ్గరినుంచి, కోరమీసాల నలభై యేళ్లవాళ్ళదాకా ఆ గుంపులో వున్నారు.

దొంగల ముఠాకు 'బాస్'లా, టికెట్‌లెస్ ప్రయాణికుల సంఘానికి గౌరవాధ్యక్షుడిలా - కాస్తా విభిన్నమైన వ్యక్తిగా రంగపతి ఆ జట్టుతో నడుస్తున్నాడు.

***

పై సంఘటన జరిగిన కొత్తలో, ఏదో పెళ్లికి హాజరుకావడంకోసం నేను మల్లవరం వెళ్లవలసి వచ్చింది. పందిరిలో ప్రక్కన్నే కూచుని వున్న ఆ ఊరి పెద్దమనిషి ఒకాయనతో మాట్లాడుతూ వుండి, మాటల సందర్భంలో "ఏమండీ! రంగపతి సంసారం ఎలా వుంది?" అని వాకబు చేశాను.

"ఏముందీ? ఈనాటికీ, రేపటికీ, మరెప్పటికైనా అది డిటోనేకదా! సంపాదించ కుండా డబ్బు, పనిచేయకుండా తిండి, పడుకున్నచోటల్లా నిద్ర - ఇదంతా ఎవరికి కలిగే అదృష్టం! అలాంటి అదృష్టవంతుడు గదయ్యా రంగపతి! ఇక అతడి సంసారమంటావా? పరవాలేదు. భర్తనీడ పడకపోతే, జగదాంబ కాపురాన్ని దివ్యంగా లాక్కుపోగలుగుతుంది.

అటు బడిలో డ్యూటీ నిర్వహించడంలోగానీ, ఇటు సంసారాన్ని చక్కబెట్టుకోవడంలో గానీ ఆమెను వేలెత్తిచూపించగలమా? సాధ్యం కాదు. పిల్లల్ని పెంచే తీరు మాత్రం?

ఇంటిపనుల్లో సాయపడ్డం దగ్గరినుంచీ, బుద్ధిగా చదువుకునేదాకా ఆ కూతురూ, కొడుకూ ఆణిముత్యాలేగదయ్యా! పుణ్యంకొద్దీ పురుషుడు, పూజకొద్దీ బిడ్డలు - అంటారుగదా! గత జన్మలో జగదాంబ అట్టే పుణ్యం చేసినట్టు లేదు. పూజలు మాత్రం గొప్పవే చేసి వుంటుంది."

పుణ్యాలను గురించి, పూజలను గురించి నాకేమీ తెలియదు. అయితే జగదాంబ ఆలోచనల పంథాకూడా ఏమిటో నాకు తెలిసొచ్చింది. తనబిడ్డలు పెరిగి పెద్దవాళ్ళయ్యాక, వాళ్ళ తండ్రిలా కాకపోయినా, నిజంగా అవసరాలు ఏర్పడినప్పుడైనా రైలు ప్రయాణం చేయవలసి వుంటుంది గదా! అప్పుడిక టిక్కెట్టు కొనుక్కునిగానీ రైలెక్కగూడదన్న స్థితికి, నియమానికి వాళ్ళు కట్టుబడి వుండాలన్నది ఆమె గుండె లోలోతుల్లోని కోరికై వుంటుంది.

❖ స్వాతి - 14 ఆగష్టు, 1998. ❖